సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 5 । మార్చి । 2024



ఎన్నాళ్లీ గోదావరీ

గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టుల్లో నీరు లేక పంటలు ఎండుతున్నాయి.

వివరాలు 8లో ▸



ఆయిల్‌పాం వైపు అడుగులు

దీర్ఘకాలిక రాబడి ఉండటంతో రైతులు ఆయిల్‌పాం సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

వివరాలు 8లో ▸



మరమ్మతులు చేపట్టేనా?

నాసిరకంగా నిర్మాణం చేసిన చెక్‌డ్యాంలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

పది మంది విద్యార్థులు డిబార్

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు రాస్తున్న పది మంది విద్యార్థులు డిబార్ అయినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. సోమవారం ఫస్టియర్ విద్యార్థులకు గణితం, వృక్షశాస్త్రం, రాజనీతి శాస్త్రం పరీక్షలు జరిగాయి. కాపీ కొడుతున్న 10 మంది విద్యార్థులను స్క్వాడ్ సిబ్బంది డిబార్ చేసినట్లు ఆయన వివరించారు.

సీఐటీయూతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాములు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి మంచి వేతన ఒప్పందం చేసే సత్తా కేవలం సీఐటీయూతోనే సాధ్యమని రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సోమవారం బండలగూడలోని పెన్నార్ పరిశ్రమ యూనియన్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ పెన్నార్ పరిశ్రమలో ఈనెల 6వ తేదీన జరిగే యూనియన్ ఎన్నికల్లో సీఐటీయూను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ మద్దతు ఇవ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, మల్లేశం, కే.రాజయ్య, శ్రీశైలం, జయమ్మ పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మంత్రికి బసవేశ్వరుడి చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: రాష్ట్రంలో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సమాజ్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. మాజీ ఎంపీ, కాంగ్రెస్ నాయకులు సురేష్ షెట్కార్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బసవ దళ్ తెలంగాణ అధ్యక్షుడు శంకర్‌పాటిల్, లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు సంగమేశ్వర్ తదితరులు సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న వీరశైవ లింగాయత్‌లు పేదరికంలో మగ్గుతున్నారన్నారు. కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఆ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలని విన్నవించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సదాశివపేట చైర్‌పర్సన్‌గా అపర్ణ



అపర్ణకు ఎన్నిక పత్రం అందజేస్తున్న ప్రిసైడింగ్ అధికారి వసంతకుమారి

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ అపర్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మపై పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసింది. సోమవారం ఉదయం 11 గంటలకు ఆర్డీఓ, ప్రిసైడింగ్ అధికారి వసంతకుమారి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి 26 మంది కౌన్సిలర్లకు గాను 19 మంది హాజరయ్యారు. 26వ వార్డు కౌన్సిలర్ అపర్ణ పేరును 23వ వార్డు కౌన్సిలర్ ఇంద్ర మోహన్‌గౌడ్ ప్రతిపాదించగా, 20వ వార్డు కౌన్సిలర్ ఆకుల శివకుమార్ బలపర్చారు. పదవికి మిగతా సభ్యులెవరూ పోటీలో లేకపోవడంతో అపర్ణ చైర్‌పర్సన్‌గా ప్రకటించారు. అనంతరం ఆర్డీఓ ఆమెతో ప్రమాణస్వీకారం చేయించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అపర్ణను కౌన్సిలర్లు, అధికారులు అభినందించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం ఎదుట టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

మండే ఎండ..

ఉపాధికేది నీడ



నారాయణఖేడ్: ఎండలోనే ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- పని ప్రాంతాల్లో కూలీలకు వసతులు నిల్
- జాడలేని గుడారాలు, మెడికల్ కిట్లు
- వేసవి భత్యం లేనట్టేనా?

నారాయణఖేడ్: ఎండలు ముదురుతున్న నేపథ్యంలో జిల్లాలో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పని ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండుటెండల్లో పనులు చేసి అలసిన కూలీలు సేద తీరడానికి అవసరమైన టెంట్లు వేయాల్సి ఉన్నా.. కొన్నేళ్ల నుంచి వీటిని సరఫరా చేయడం లేదు. దీంతో ఎండలోనే భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వేసవిలో మార్చి నుంచి జూన్ రెండో వారం వరకు జరిగే ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు సరైన వసతులు కల్పించాలి. వడదెబ్బ తగలకుండా గుడారాలు వేసి రక్షణ కల్పించాల్సి ఉంటుంది. కానీ ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ఎండలో పనిచేస్తూ తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. పనులు చేసే సమయంలో కూలీలకు ఏదైనా దెబ్బ తగిలితే అక్కడే ప్రథమ చికిత్స అందించాలి. వడదెబ్బ తగల కుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. ఇవెక్కడా కనిపించడం లేదు. ప్రభుత్వమే గడ్డపార, పార, గుల్ల (తట్ట) పంపిణీ చేయాలి. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు ఇవన్నీ ఉచితంగా ఇచ్చారు. ఇప్పుడు వాటి ఊసేలేదు.

639 పంచాయతీల్లో పనులు

జిల్లాలోని 24మండలాల్లోని 639 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం అమలు అవుతోంది. మొత్తం 2,37,725మంది ఉపాధి కూలీలు ఉన్నారు. 32,267మంది కూలీలు నిత్యం పనులు చేస్తున్నారు. రోజుకు సరాసరి ఒక్కో పంచాయతీలో 50మంది కూలీలు హాజరవుతున్నారు. నీటి వనరుల్లో పూడిక తీత, పంటల కాలువలు, మట్టిదారుల నిర్మాణాలు, కందకాల తవ్వకాలు, వరద మళ్లింపు, నర్సరీల్లో మొక్కల పెంపకం తదితర పనులు కొనసాగుతున్నాయి.

ఉపాధి కూలీలు మండుటెండల్లో మగ్గుతున్నారు. పని ప్రాంతాల్లో నిలువ నీడ లేక అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీరు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. గంటల తరబడి ఎండలో పనిచేస్తున్న వారికి కనీస సౌకర్యాలు కల్పించే నాథుడే కనిపించడం లేదు.

కొన్నేళ్ల నుంచి బంద్..

ఉపాధి కూలీలు భోజనం చేయడానికి, అలసి సేదతీరడానికి ప్రభుత్వం గుడారాలు (టెంట్లు) పంపిణీ చేసేది. వాటిని ఫీల్డ్ అసిస్టెంట్లు నిత్యం పనిప్రదేశానికి తీసుకెళ్లి వసతి కల్పించాలి. కమిషనర్ రూరల్ డెవలప్‌మెంట్ (సీఆర్డీ) ద్వారా వీటిని సరఫరా చేశారు. ఆ సమయంలో ఇచ్చిన టార్పాలిన్లు భద్రంగా ఉంచాలని మేట్‌లకు బాధ్యత అప్పజెప్పారు. పనుల వద్ద కూలీలు నీడన ఉండటానికి ఈ టార్పాలిన్లు వేయాల్సిన బాధ్యత కూడా వారిదే. కొన్నేళ్ల నుంచి వాటి పంపిణీని ప్రభుత్వం మరిచిపోయింది. ఈ ఏడాదైనా సమకూరిస్తే సౌకర్యంగా ఉంటుందని కూలీలు పేర్కొంటున్నారు. 2015–16 నుంచి మెడికల్ కిట్ల పంపిణీ మరిచారు. కూలీలకు చిన్న గాయాలైనప్పుడు, శరీరంలో నీటిశాతం తగ్గినప్పుడు ప్రథమ చికిత్స చేయడానికి వీటిని ఉపయోగిస్తారు. ఈ కిట్లలో అయోడిన్ సీసా, బ్యాండేజ్, దూది, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, కొన్ని రకాల మాత్రలు ఉండేవి. కూలీలకు వీటిని కూడా సమకూర్చడం లేదు. గతంలో వేసవిలో అదనపు కూలి మార్చిలో 20శాతం, ఏప్రిల్‌లో 25 శాతం, మేలో 30శాతం పెంచి చెల్లించేవారు. ఇప్పుడు ఆ చెల్లింపులు లేవు.

వసతులు కల్పించాలి



ఎండలో ఉపాధి పనులు చేస్తున్నాం. వసతులు కల్పించాలి. నీడ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. గతంలో గుడారాలు వేసేవారు. మెడికల్ కిట్లు ఉండేవి. ఇప్పుడు లేవు. అలసటగా ఉంటే చెట్ల చాటున సేద తీరుతున్నాం.

– పద్మ, కూలీ, అబ్బెంద

ఎండలు మండుతున్నాయి



ఈ ఏడు అప్పుడే ఎండలు పెరిగాయి. ఎండల ఇబ్బందులు తీర్చేందుకు నీడ, నీటి వసతులు కల్పించాలి. ఉపాధి అదనపు కూలీ వేసవిలో పెంచడంలేదు. ఎండల ఇబ్బందులు తట్టుకోలేక చెట్ల నీడన సేదతీరాల్సి వస్తుంది.

– నర్సింహులు, కూలీ, అబ్బెంద



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

సంగారెడ్డి టౌన్: ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని డీఆర్‌ఓ పద్మజారాణి, కలెక్టర్ ఏఓ పరమేష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 38 ఫిర్యాదులు వచ్చాయని వారు తెలిపారు.

పట్టా పాస్‌బుక్ అందించండి

మహ్మద్ అలీ



పట్టా పాస్ బుక్ కోసం కొన్నేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాని కోహీర్ మండలం చింతలగట్టు గ్రామానికి చెందిన మహ్మద్‌అలీ తెలిపాడు. అధికారులు పట్టించుకోవడం లేదని, జిల్లా అధికారులైనా స్పందించి పాస్ బుక్ అందించాలని కోరాడు.

ఇల్లు మంజూరు చేయండి

డేవిడ్



దివ్యాంగుడినైన తనకు సొంత ఇల్లు లేక, అద్దె ఇంటికి కిరాయి కట్టలేకపోతున్నానని న్యాల్కల్ మండలం గుంజేటి గ్రామానికి చెందిన డేవిడ్ దరఖాస్తు పెట్టుకున్నాడు. ప్రభుత్వం స్పందించి ఇల్లు మంజూరు చేయాలని కోరాడు.

17 లోక్‌సభ స్థానాల్లో బీజేపీదే విజయం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమానందరెడ్డి

సంగారెడ్డి: రాష్ట్రంలోని 17లోక్‌సభ స్థానాలలో బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమానందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మంగళవారం నిర్వహించే ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని కోరారు. నలుగురు ఎంపీలు ఉంటేనే తొమ్మిది లక్షల కోట్ల నిధులను కేటాయించారని, 17 మంది ఎంపీలుంటే ఎన్ని నిధులు వస్తాయో ప్రజలు ఆలోచించాలన్నారు. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. అంతకుముందు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా పర్యటనకు వస్తున్న ప్రధానికి ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు డాక్టర్ రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాలకులైనా సేవకులుగా పనిచేయాలి



నూతన పాలకవర్గంతో నిర్మలారెడ్డి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తూర్పు నిర్మల

సదాశివపేట(సంగారెడ్డి): వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక సభ్యులు సమన్వయంతో రైతుల సమస్యలు పరిష్కరించాలని, పాలకులైనా సేవకులుగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూర్పు నిర్మలారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్‌గా సదాకుల కుమార్, వైస్ చైర్మన్‌గా మ్యాడం రాధాకృష్ణ, పాలకవర్గ సభ్యులు బేగరి చిరంజీవి, విశ్వనాథ్‌కళావతి, గడీల నరేందర్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్, చౌహాన్‌సోమ్లా, శివకుమార్, సయ్యద్ యూసుఫ్, మధుకర్‌రెడ్డి, సైలేందర్‌రెడ్డి, శేఖర్, లక్ష్మణ్‌కుమార్, రమేష్, ఎం.మాణిక్‌రెడ్డిలతో జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కొండాపూర్ ఎంపీపీ మనోజ్‌రెడ్డి, మునిపల్లి సత్యనారాయణ, సిద్దన్న, రాంరెడ్డి, నాగరాజ్‌గౌడ్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: మహిళలు ప్రత్యేకంగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. సోమవారం పట్టణంలోని దుర్గాబాయి మహిళా వికాస కేంద్రంలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఉపాధి శిక్షణ సంస్థ అందిస్తున్న ఉచిత శిక్షణను ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందాలని అన్నారు. అలాగే న్యాయపరమైన సేవలను ఉచితంగా పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో మహిళ వికాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని సభకు మూడంచెల భద్రత

ఎస్పీ రూపేష్



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ రూపేష్

పటాన్‌చెరు టౌన్: ప్రధాని మోదీ జిల్లా పర్యటన సందర్భంగా పోలీస్ శాఖ మూడంచెల భద్రత ఏర్పాటు చేసింది. వివిధ జిల్లాలకు చెందిన 2000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని ఎస్పీ రూపేష్ తెలిపారు. సోమవారం ప్రధాని సభ స్థలాన్ని డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌తో కలిసి ఎస్పీ పరిశీలించారు. అనంతరం అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ ఎల్లంకి కళాశాలలో వారు మాట్లాడారు. సభ వద్దకు వాటర్ బాటిళ్లు, బ్యాగులు తీసుకురావద్దన్నారు. చుట్టుపక్కల ఐదు కిలో మీటర్ల మేర డ్రోన్ కెమెరాలు ఎగిరేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

కట్టుదిట్టమైన భద్రత

ప్రధాని రాక నేపథ్యంలో ఏడుగురు ఎస్పీలు, 20 మంది అదనపు ఎస్పీలతో పాటు 160 మంది డీఎస్పీలు, 45 మంది సీఐలు, 120 మంది ఎస్ఐలతో పాటు 2000 మంది పోలీసులు బందోబస్తును పర్యవేక్షించనున్నారు. సభా ప్రాంగణం ఎస్పీజీ వలయంలోకి వెళ్లిపోయింది. డాగ్ స్క్వాడ్, బాంబ్స్ స్క్వాడ్ లతో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా..

మోదీ రాక సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఆటంకం కలగకుండా చూస్తామన్నారు. సమయాన్ని కంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఎస్పీ సూచించారు.

ట్రాఫిక్ ఆంక్షలు

- కామారెడ్డి, రామాయంపేట, తూప్రాన్ వైపు నుండి మీటింగ్ కు వచ్చే బస్సులు కండ్లకోయ దగ్గర ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్డు) ఎక్కి, సుల్తాన్ పూర్ ఎగ్జిట్ నెంబర్–4 దగ్గర దిగి, కృష్ణారెడ్డిపేట,పటేల్‌గూడా మీదుగా ఎల్లంకి కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్ కు చేరుకోవాలని ఎస్పీ రూపేష్ తెలిపారు.
- సిద్దిపేట, గజ్వేల్ వైపు నుంచి మీటింగ్ కు వచ్చే బస్సులు శామీర్‌పేట్ దగ్గర ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్డు) ఎక్కి, సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ నెంబర్–4 దగ్గర దిగి, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడా మీదుగా ఎల్లంకి కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌కు చేరుకోవాలన్నారు.
- మెదక్, నర్సాపూర్ వైపు నుంచి మీటింగ్‌కు వచ్చే బస్సులు గుండ్ల పోచమ్మ దగ్గర ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కి, సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ నెంబర్–4 దగ్గర దిగి, కిష్టారెడ్డిపేట పటేల్‌గూడ మీదుగా ఎల్లంకి కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌కు చేరుకోవాలన్నారు.
- సంగారెడ్డి, జహీరాబాద్, జోగిపేట వైపు నుండి మీటింగ్‌కు వచ్చే బస్సులు ముత్తంగి ఎగ్జిట్ నెంబర్–3 వద్ద ఓఆర్ఆర్ ఎక్కి సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ నెంబర్–4 వద్ద దిగి, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ మీదుగా ఎల్లంకి కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌కు చేరుకోవాల్సి ఉంటుందన్నారు.
- హత్నూర, దౌల్తాబాద్ వైపు నుంచి మీటింగ్ కు వచ్చే బస్సులు ముత్తంగి ఎగ్జిట్ నెంబర్–3 వద్ద ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కి ఎగ్జిట్ నెంబర్–4 దగ్గర దిగి, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ మీదుగా ఎల్లంకి కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్ కు చేరుకోవాల్సి ఉంటుందన్నారు.
- హైదరాబాద్, లింగంపల్లి మీదుగా మీటింగ్ కు వచ్చే బస్సులు ముత్తంగి దగ్గర ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కి, ఎగ్జిట్ నెంబర్–4 దగ్గర దిగి, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడా మీదుగా ఎల్లంకి కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్లేస్‌కు చేరుకోవాల్సి ఉంటుందన్నారు.

మహోత్సవానికి కేతకీ ముస్తాబు



ఝరాసంగం శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయం

- నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- ఆలయంలో ఏర్పాట్లు పూర్తి
- 10న శివపార్వతుల కల్యాణం, రథోత్సవం

ఝరాసంగం(జహీరాబాద్): భక్తుల కోరిన కోర్కెలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయం మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. నేటి నుంచి జాతర ప్రారంభం కానుంది. ఇందుకోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. ఆలయం వద్ద వసతుల కల్పనకు ఆర్డీఓ, వివిధ శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఆలయం, రాజగోపురం, కమాన్, శివపార్వతుల విగ్రహాలకు రంగులు వేయించారు. పార్కింగ్, క్యూలైన్లు, బారికేడ్లు, తాగునీరు తదితర వసతుల ఏర్పాటుపై దృష్టి సారించారు. అలాగే కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

- ఈ నెల 5వ తేది మంగళవారం అంకురార్పణ, ధ్వజారోహణం, విఘ్నేశ్వరపూజ, స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఉదయం 11.15 గంటలకు శిఖరపూజ, రాత్రి పల్లకీ సేవా భజనలు నిర్వహిస్తారు.
- 6వ తేదీన స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన.
- 7న స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, సాయంత్రం 5గంటలకు శేష వాహన సేవ, గ్రామ ఊరేగింపు, రాత్రి పల్లకీ సేవ, భజనలు.
- 8న మహాశివరాత్రి, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, స్వామివారికి అభిషేకం, రాత్రి లింగోద్భవ సమయమున మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, రుత్వికరణ, పల్లకీ సేవ, భజనలు.
- 9వ తేదీన స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్ర స్వాహాకార హోమం, నవగ్రహ శాంతి హోమం, సాయంత్రం 5 గంటల నుంచి నంది వాహన సేవ, రాత్రి 12 గంటలకు అగ్నిగుండం, పూజ, అగ్ని ప్రతిష్ట.
- 10వ తేదీన సాయంత్రం 5.30 నిమిషాలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రాత్రి 10.30 నిమిషాలకు స్వామివారి విమాన రథోత్సవం, పల్లకీ సేవ ఉంటుంది. కళ్యాణంలో పాల్గొనే భక్తులు రూ.1116 రుసుం చెల్లించాల్సి ఉంటుంది.
- 11, 12న స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, పల్లకీ సేవ, భజనలు.
- 13న లక్ష బిల్వార్చన, అన్నదానం, పల్లకీ సేవతో జాతర ముగుస్తుంది.



గర్భగుడిలో పార్వతీ పరమేశ్వరులు

జాతరకు ఏర్పాట్లు పూర్తి



మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని కేతకీ ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈసారి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్, జహీరాబాద్ పట్టణాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది.

– శశిధర్, ఆలయ ఈఓ, ఝరాసంగం

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ


మెడల్స్‌తో విద్యార్థులు

గజ్వేల్ : హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడలో 3వ తేదీన జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో గజ్వేల్‌కు చెందిన బుడోకాన్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన శ్రీజ, స్వాతి వెండి పతకాలు, నలంద పాఠశాలకు చెందిన నర్సింహ వెండి పతకం, దేవాన్ష్ కాంస్య పతకం, వర్గల్ మండల శాకారం గ్రామానికి చెందిన వంశీ బంగారు పతకాలను సాధించారు. వీరిని ఆయా పాఠశాలల యాజమాన్యాలు, కరాటే అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేశ్ అభినందించారు.

వర్గల్(గజ్వేల్): రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వర్గల్ జెడ్పీహైస్కూల్ విద్యార్థి అఖిలాష్ (9వ తరగతి) చక్కని ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా సోమవారం వర్గల్ హైస్కూల్‌లో అఖిలాష్‌ను, కోచ్ వంశీని హెచ్‌ఎం వెంకటేశ్వర్‌గౌడ్ అభినందించి సన్మానించారు.

జాతీయ క్రీడలకు ఎంపిక


అనూష రవళి


చేర్యాల(సిద్దిపేట) : ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ పట్టణంలో 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా తరఫున మండల పరిధిలోని ఆకునూరుకి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్ బాల్ కార్యదర్శి ఎండీ.రఫత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆకునూరుకు చెందిన హ్యాండ్ బాల్ క్రీడాకారిణి తుంగ అనూష (గోల్ కీపర్), గూడూరు రవళి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేర్గు శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

దుబ్బాక విద్యార్థుల హవా


పతకాలతో విద్యార్థులు

దుబ్బాక: ఇన్విటేషన్ నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ కరాటే పోటీల్లో దుబ్బాక పట్టణ విద్యార్థులు పతకాలు సాధించినట్లు యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకుడు, షైల్ చీఫ్ మాస్టర్ బురానీ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. విక్టరీ షోతోకన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్యారడైస్ గార్డెన్‌లో రాష్ట్ర స్థాయి కరాటే కుంగ్ ఫూ చాంపియన్ షిప్ పోటీలు జరిగినట్లు తెలిపారు. ఇందులో దుబ్బాక పట్టణానికి చెందిన 21 మంది విద్యార్థులు పాల్గొని 5 గోల్డ్ మెడల్స్, 4 సిల్వర్స్, 11 బ్రాంజ్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. పథకాలను సాధించిన విద్యార్థులను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఈజీసీఓ ముక్తేశ్వరి అభినందించినట్లు తెలిపారు.

ఎన్నాళ్లీ గోదావర్రీ


గౌరవెల్లి ప్రాజెక్టు

కరువు నేల హుస్నాబాద్ మెట్ట ప్రాంతాన్ని గోదావరి జలాలు ఇప్పట్లో తాకేలా లేవు. ఇక్కడి రైతుల కష్టాలను తీర్చాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో గౌరవెల్లి, గండిపెల్లి రిజర్వాయర్లను నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టులకు రీ డిజైన్ చేసిన కొత్త ప్రభుత్వం పనులు మొదలు పెట్టి 95 శాతం పూర్తి చేసింది. అధికారులు 2023 జూలైలో ట్రయల్ రన్ చేసి నాలుగు రోజులు ప్రాజెక్టులకు గోదావరి జలాలను వదిలారు. ఇంతలోనే గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసు ఉందని పనులను నిలిపేశారు. దీంతో పంటలకు నీళ్లు లేక ఎండిపోతుండడంతో రైతులు నానా కష్టాలు పడుతున్నారు.

– హుస్నాబాద్‌రూరల్

మెట్ట నేలను తాకని గోదావరి జలాలు

- గౌరవెల్లి, గండిపెల్లి రిజర్వాయర్లు నీళ్లు లేక వెలవెల
- ఎండిపోతున్న ఆయకట్టు పంటలు
- పక్షంలో అడుగంటిన భూగర్భజలాలు
- నీళ్ల కోసం భగీరథ ప్రయత్నాలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

హుస్నాబాద్ ఉమ్మడి మండలం గుడాటిపల్లిలో ఇందిరమ్మ వరద కాల్వలకు అనుసంధానంగా నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంతో వరంగల్, జనగామ, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలోని 1.60 లక్షల ఎకరాలకు 2 పంటలకు సాగు నీరు రాబోతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణంకు 3,845.17 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 3,487.16 ఎకరాల భూమిని సేకరించారు. మరో 40 ఎకరాల భూమి సేకరిస్తే భూ సేకరణ పూర్తి అవుతుంది. గండిపెల్లి ప్రాజెక్టులో 1 టీఎంసీ, గౌరవెల్లి ప్రాజెక్టులో 8.23 టీఎంసీల నీరును రెండు దఫాలు నింపితే 1.60 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇచ్చే అవకాశం ఉంటుంది. వచ్చే ఖరీఫ్ వరకు మిడ్‌మానేరు నుంచి గౌరవెల్లి ప్రాజెక్టులోకి 4 టీఎంసీల గోదావరి జలాలను తెచ్చి రైతులకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ అధికారులు గౌరవెల్లి ప్రాజెక్టు పనులు చేపట్టారు. ప్రభుత్వం మారడంతో గౌరవెల్లి ప్రాజెక్టు పనులు అక్కడే నిలిచిపోయాయి. రైతులు ఇక మనకు గోదావరి జలాలు రావని నిర్ణయానికి వచ్చి బోర్లు, బావులు తవ్వే ప్రయత్నాలు చేస్తున్నారు.


నీళ్లు లేక పగుళ్లు పట్టి వరి పొలం

భగీరథ ప్రయత్నం

వరి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతూ అప్పులు చేసి బోర్లు వేసుకుంటున్నారు. కొందరు రైతులు వాగులు, చెరువుల నుంచి మోటార్ల ద్వారా పంటలకు నీరు అందిస్తున్నారు. చిన్న సన్నకారు రైతులు బావులను పూడిక తీసేందుకు క్రేన్సను కిరాయిలకు తెచ్చుకొని పనులు చేసుకుంటున్నారు. గతంలో ఉపాధి హామీ పథకంలో ఊట బావుల పూడికతీత పనులు ఉండేది ఇప్పుడు అవి లేకపోవడం రైతులకు అదనపు ఆర్థిక భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తికాని కాల్వలు..


అసంపూర్తిగా ఉన్న కాల్వ

గౌరవెల్లి ప్రాజెక్టును గోదావరి జలాలతో నింపిన తర్వాత ప్రాజెక్టు కుడి ఎడమ కాల్వల ద్వారా గొలుసు కట్టు చెరువులను నింపి చెరువుల కింది ఆయకట్టు రైతులకు సాగు నీళ్లు అందించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కుడి కాల్వ ద్వారా 22.79 క్యూసెక్‌లు, ఎడమ కాల్వ నుంచి 3.06 క్యూసెక్‌లు సాగు నీళ్లను చెరువులకు వదులతారని రైతులు కోటి ఆశలతో ఎదురు చూసినా అడియాసలే అయ్యాయి. కుడి కాల్వ పూర్తి అయినా ఎడమ కాల్వ పూర్తి కాలేదు. హుస్నాబాద్ డివిజన్‌లో 70 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తే నీళ్లు లేక పంటలు ఎండిపోవడంతో రైతులు నానా కష్టాలు పడుతున్నారు.

రెండు బోర్లు వేసినా నీళ్లు రాలే..



నాలుగు ఎకరాల మిర్చి పెడితే నీళ్లు కాసే తోటను గొర్రెలకు వదిలేసిన. కళ్ల ముందు కష్టం చేసిన పంట ఎండిపోతుంటే చూడలేక 500 ఫీట్లు, ఒకటి 350 ఫీట్లు రెండు బోర్లు ఏసినా చుక్క నీళ్లు రాలేదు. 23 గజాల లోతు బాయిల నీళ్లు 15 రోజుల్లో పాతాలానికి పడిపోయిన్నాయ్. బోర్ల ఏసిన బాకీ తీర్చడానికి రెండు పాలు ఇచ్చే ఆవులను అమ్మితే అంగట్ల అగ్వుకు అడుగితే రూ.60 వేలు వచ్చాయి. మిర్చి అమ్మిన తర్వాత మిగితా బాకీ కట్టి రావాలె.

– జనగామ సంపత్‌రావు, గాంధీనగర్

రైతుల బతుకులు గోదాట్ల ఏసిండ్రు



పోయిన వానా కాలంలో గౌరవెల్లి ప్రాజెక్టులకు గోదావరి నీళ్లు తేవడానికి మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ట్రయల్ రన్ చేసిండ్రు. నాలుగు రోజులు ప్రాజెక్టులకు నీళ్లు పోస్తే ఇక రైతులకు సాగు నీరు తిప్పలు లేవకున్నాం. అయిపాయే ప్రభుత్వం మారింది ప్రాజెక్టు ముచ్చటలేనే లేదు. పంటలకు నీళ్లు లేక ఎండుతుంటే ఒక నాయకుడు అడిగినోళ్లు లేకపాయే.

– రాంగోపాల్‌రావు, రైతు

సాగుకు నీళ్లు అందించాలి


కెనాల్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- కాల్వల ద్వారా చెరువులు, కుంటలు నింపాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): రైతులు సాగు చేసిన పంటలకు మల్లన్నసాగర్ కాల్వల ద్వారా నీళ్లు అందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని ముబారస్‌పూర్‌లో పెండింగ్‌లో ఉన్న కెనాలను భూ యజమానులతో మాట్లాడి జేసీబీతో కెనాల్‌ను తవ్వించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నీళ్లను అందించేందుకు ఇరిగేషన్ అధికారులు పెండింగ్‌లో ఉన్న కెనాల్ పనులను పూర్తి చేయాలన్నారు. పంటలు ఎండిపోకుండా మల్లన్నసాగర్ నుంచి కాల్వల ద్వారా వచ్చే నీళ్లతో చెరువులు, కుంటలు నింపి నీళ్లను అందించే మార్గాన్ని ఇరిగేషన్ అధికారులు చేపట్టాలన్నారు. అనంతరం సూరంపల్లి గ్రామంలోహెయిర్ సెలూన్ ప్రారంభించి, మాచిన్‌పల్లి గ్రామంలో మల్లన్న జాతరకు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, ముబారస్‌పూర్ ఎంపీటీసీ బోటుక తిరుపతి, బండారు దేవేందర్, మాజీ సర్పంచ్‌లు అయ్యంగారి నర్సింహులు, యాదవరెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే దౌల్తాబాద్ మండల కేంద్రంలో 8వ తేదీ నుంచి జరిగే శ్రీ స్వయంభు శంభులింగేశ్వర ఆలయ జాతరకు రావాలని ఎమ్మెల్యేకి ఆలయ కమిటీ చైర్మన్ ఆది వేణుగోపాల్ ఆహ్వాన పత్రికను అందించారు.

తప్పుడు పత్రాలతో ఆస్తి లాక్కున్నారు


నిరసన తెలుపుతున్న సోనిప్రియ

- ప్రశ్నిస్తే చంపుతానంటూ బెదిరిస్తున్నారు
- కలెక్టరేట్ ఎదుట ఓ బాధితురాలు నిరసన

మెదక్ కలెక్టరేట్: అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి నాకు రావాల్సిన ఆస్తిని లాక్కున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఓ బాధితురాలు మెదక్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన తమ్మలి సోనిప్రియ మాట్లాడుతూ.. భర్త శ్రీకాంత్ 2020లో గజ్వేల్ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లు తెలిపారు. భర్త సోదరుడైన తమ్మళి శివలింగం నాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భర్త పేరున మరణ ధృవీకరణ పత్రం తీసుకొని ఆస్తులు అతడి పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని వాపోయింది. ఈ విషయంపై మూడేళ్లగా తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శివలింగంను ప్రశ్నిస్తే నన్ను, నా పిల్లలను చంపుతానంటూ బెదిరిస్తున్నాడని వాపోయింది. కలెక్టర్ స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు.

ట్రాక్టర్ తగులబెట్టిన దుండగులు

మిరుదొడ్డి(దుబ్బాక): వ్యవసాయ ట్రాక్టర్‌ను గుర్తు తెలియని దుండగులు దహనం చేసిన ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు కూచంగారి దుర్గయ్య వివరాల ప్రకారం.. వ్యవసాయ భూమి వద్ద క్రేజ్ వీల్ నిలిపి ఉంచగా రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాక్టర్ ఇంజన్‌తోపాటు టైర్లను గడ్డి వాములో వేసి తగులబెట్టినట్లు వాపోయారు. మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆయిల్‌పామ్ తోట దగ్ధం

నంగునూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఆయిల్‌పామ్ తోట దగ్ధమైన ఘటన సోమవారం మైసంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు దుర్గారెడ్డి మూడేళ్ల కిందట ఉపాధి హామీ పథకంలో 171 ఆయిల్‌పామ్ మొక్కలు నాటాడు. ఇటీవలె గెలలు వేయడంతో పంట చేతికొచ్చే దశలో ఉంది. మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి కింద ఉన్న గడ్డి అంటుకోవడంతో డ్రిప్పుతోపాటు చెట్లు కాలిపోయాయి. ఇది గమనించిన రైతులు మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సుద్దాల శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్, రవి కాలిపోయిన మొక్కలను పరిశీలించారు.

కుమారుడిపై తండ్రి కత్తితో దాడి


చికిత్స పొందుతున్న వంశీ

తూప్రాన్: కుమారుడిపై తండ్రి కత్తితో దాడికి పాల్పడిన ఘటన మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన గొల్ల కిష్టయ్య కుమారుడు వంశీ కొన్నేళ్లుగా తాగుడుకు బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. పలుమార్లు మందలించినా ప్రవర్తన మార్చుకోలేదు. విసుగు చెందిన తల్లి గతేడాది విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. అయినా అతడిలో మార్పు లేదు. ఈ క్రమంలోనే వంశీ భార్య సైతం భర్త అలవాట్లు భరించలేక పుట్టినిళ్లు నిజామాబాద్ జిల్లా వర్నీకి వెళ్లిపోయింది. కొడుకు ప్రవర్తనతో విసిగిపోయిన తండ్రి కిష్టయ్య, అతడి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్న లక్ష్మణ్‌తో కలిసి సోమవారం ఇంటికొచ్చిన వంశీపై కత్తులతో దాడి చేశారు. చేతికి, కడుపులో తీవ్ర గాయాలు కాగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతోపాటు వంశీని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఎస్‌ఐ తెలిపారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని, అందిన వెంటనే కేసు నమోదు చేస్తామన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

ప్రియుడితో కలిసి భర్తను హత్య

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇందులో ఐదుగురు నిందితులను అరెస్ట్ సోమవారం రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి కార్యాలయంలో వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల దుర్గేశ్ అలియాస్ దుర్గయ్య(28), భార్గవి దంపతులు. ఈమె ఓ కళాబృందంలో కొంతకాలంగా కలిసి నత్యం చేస్తుంది. అక్కడే మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మానేపల్లి గ్రామానికి చెందిన జాల అశోక్‌తో పరిచయం ఏర్పడింది. తరచూ ఇద్దరు కలుసుకోవడంతో భర్త దుర్గేశ్‌కు అనుమానం వచ్చింది. పలుమార్లు భార్గవిని హెచ్చరించి కొట్టాడు. దీంతో భర్తను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని పథకం వేసింది. ప్రియుడు జాల అశోక్ పథకం వేసుకొని ఫిబ్రవరి 29వ తేదీన భర్తను చిప్పల్‌తుర్తి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లింది. అశోక్ తన స్నేహితులు గొల్ల పర్వతాలు, గొల్ల మహేశ్, సంతోష్‌తో కలిసి దుర్గేశ్‌తో అతిగా మద్యం తాగించారు. అనంతరం టీషర్టుతో ఉరివేసి బండరాయితో మోది చంపేశారు. మరుసటి రోజు అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తమదైన శైలిలో భార్యను విచారించగా నేరం ఒప్పుకున్నారు.

రాంగ్ రూట్‌లో వచ్చి.. ఆటోను ఢీకొట్టి

- ద్విచక్ర వాహనదారుడి తప్పిదంతో ఆటో బోల్తా
- ముగ్గురికి గాయాలు


ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

కొల్చారం(నర్సాపూర్): ఆటో బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని మెదక్-నర్సాపూర్ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వడ్ల రంగాచారి ప్రయాణికులను తీసుకొని రామాయపేట మండలం ఝాన్సీ లింగాపూర్‌కు వెళ్తున్నాడు. కిష్టాపూర్ గ్రామ శివారులోని హనుమాన్ బండల్ మలుపు వద్దకు రాగానే బైక్ ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చి వీరి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడటంతో డ్రైవర్ రంగాచారికి గాయాలు అయ్యాయి. బైక్‌పై ఉన్న కిష్టాపూర్ గ్రామానికి చెందిన పసుల కుమార్, వెంకటాపూర్ గ్రామానికి చెందిన సుదర్శనంకి కాళ్లు విరిగాయి. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దశ దినకర్మకు వెళ్లొచ్చేసరికి..

ఇంట్లో చోరీ, బంగారం, వెండి అపహరణ

పటాన్ చెరు టౌన్: ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి ఎత్తుకెళ్లిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాచెరు పట్టణంలోని గోకుల్ నగర్‌కు చెందిన బోడీ భిక్షపతి యాదవ్ భార్య పోచమ్మతో కలిసి సోమవారం ఉదయం జిన్నారం మండల్ వావిలాల గ్రామంలో బంధువు చనిపోవడంతో దశ దినకర్మకి వెళ్లారు. ఉదయం 11 గంటలకు వెళ్లి మధ్యాహ్నం 2:30 గంటలకు తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. భిక్షపతి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 7.5 తులాల బంగారం, 55 తులాల వెండి దొంగలు చోరీ చేశారు. వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

ఇసుక డంప్‌లు స్వాధీనం


ఇసుక డంప్‌లను చూస్తున్న పోలీసులు

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల మండలంలోని కమాలాయపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను సోమవారం ఎస్‌ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కమాలాయపల్లిలో కొంత మంది ఇసుకను అక్రమంగా నిల్వ చేసి అమ్ముకుంటున్నారని నమ్మదగిన సమాచారం మేరకు ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట) : మండలంలోని గాగిళ్లాపూర్ శివారులోని మోయతుమ్మెద వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ వైపు అడుగులు

- ప్రోత్సాహంతో రైతుల ఆసక్తి
- అవగాహన కల్పిస్తున్న అధికారులు


ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా మిర్చి

చిన్నకోడూరు(సిద్దిపేట): వాతావరణ పరిస్థితులు అనుకూలించక పండించిన పంటలకు దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. ఎప్పుడు ఒకే రకమైనవి కాకుండా మారుతున్న కాలానికనుగుణంగా దీర్ఘకాలిక పంటల సాగుకు ఒక్కొక్కరుగా అడుగులు వేస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే 25 ఏళ్లు రాబడి వచ్చే అవకాశం ఉండడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. వివిధ నేలలు ఈ పంట సాగుకు అనుకూలమని గత ప్రభుత్వం గుర్తించి మొక్కల పెంపకం చేపట్టింది. ఎర్రమట్టి, నల్లరేగడి తదితర భూముల్లో దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉంది. నీటి వసతితోపాటు తేమశాతం అధికంగా ఉండే భూములు ఈ పంటకు అనువుగా ఉంటాయి. ఎకరాకు 50 మొక్కల వరకు నాటవచ్చు. మొక్కల మధ్యలో కూరగాయలు, మిర్చి వంటి ఆరుతడి పంటలు సాగు చేయొచ్చు.


సబ్సిడీ మొక్కలు, నిర్వహణకు సాయం..

ఆయిల్‌పామ్ ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై మొక్కలు అందజేసింది. పంటకు నీటి తడులు అందించడానికి అవసరమయ్యే డ్రిప్ కోసం ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీలకు 90 శాతం సబ్సిడీపై ఇస్తోంది. ప్రతీ ఏడాది నిర్వహణ కోసం ఎకరాకు రూ. 4,200 చొప్పున నాలుగేళ్ల వరకు అందిస్తోంది. నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి మొదలై ఏటా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

3,679 ఎకరాల్లో..

సిద్దిపేట నియోజకవర్గంలో 1,132 మంది రైతులు 3,679 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. నంగునూరు మండలంలో 1,631 ఎకరాలు, చిన్నకోడూరు 727, సిద్దిపేట అర్బన్ 377, సిద్దిపేట రూరల్ 496, నారాయణరావుపేట మండలంలో 438 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగుకు ఆసక్తి ఉన్నవారి వివరాలు నమోదు చేసి శిక్షణ ఇస్తున్నారు.

మంచి ఆదాయం



ఆయిల్‌పామ్ సాగు చేస్తే నాలుగేళ్లలో పంట చేతికి వస్తుంది. ఆ తర్వాత దిగుబడి మొదలై ఎకరాకు రూ లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఈ పంటకు డిమాండ్ ఉంది. అడవి జంతువుల బెడద ఉండదు. సాగుకు రైతులు ముందుకు రావాలి.

– భాస్కర్ రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ టెక్నికల్ అధికారి